క్లుప్తంగా

కౌలు కార్డుతో ప్రయోజనం



ముదుమాలలో కౌలు కార్డులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్/కోడుమూరు: కౌలు రైతులకు ప్రభుత్వం ఇచ్చే కౌలు కార్డుల(సీసీ ఆర్సీల) వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని సి.బెళగల్, కోడుమూరు మండలాల వ్యవసాయ అధికారులు ఏఓ మల్లేష్‌కుమార్, రవిప్రకాష్ తెలిపారు. సోమవారం ముదుమాల, గోరంట్ల ఆర్బీకేలలో వేర్వేరుగా రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొలాలను కౌలుకు తీసుకుని సాగు చేసే రైతులు తప్పకుండా కౌలు కార్డులను తీసుకోవాలన్నారు. కౌలు కార్డు ఉంటే ప్రభుత్వ సబ్సిడీలు, గిట్టుబాటు ధర, బీమా పరిహారం తదితర ప్రయోజనాలు పొందే అవకాశం ఉందన్నారు. భూ యజమానులకు కూడా ఎలాంటి నష్టం ఉండదన్నారు.

సుంకేసులకు ఇన్ ఫ్లో నిల్

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు సోమవారం ఇన్ ఫ్లో నిలిచిపోయింది. కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాల నిమిత్తం కేసీ కాల్వకు 189 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

నిబంధనల మేరకు పనులు చేయాలి



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ లక్ష్మన్న

సి.బెళగల్: నిబంధనల మేరకు పనులు చేసి గరిష్ట వేతనం పొందాలని ఏపీఓ లక్ష్మన్న ఉపాధి కూలీలకు సూచించారు. పోలకల్ గ్రామ పరిధిలో కొనసాగుతున్న ఉపాధి పనులను ఆయన సోమవారం తనిఖీ చేశారు. కూలీల హాజరును పరిశీలించారు. పని ప్రాంతంలో కూలీలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని టీఏలను ఆదేశించారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

గడివేముల: రైతుల నుంచి వచ్చే అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. వివిధ సమస్యల పరిష్కారం కోసం రైతులు సమర్పించిన దరఖాస్తులను వెంటనే పరిష్కారించాలన్నారు. అనవసరంగా కార్యాలయం చుట్టూ తిప్పుకోవద్దని, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవ, ఆర్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో భూముల ఫీల్డ్ సర్వే పూర్తి

కర్నూలు (న్యూటౌన్): మండలంలోని 12 రెవెన్యూ గ్రామాల్లో భూముల ఫీల్డ్ సర్వే పూర్తయిందని రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతనపల్లె గ్రామంలో రీ సర్వే ప్రారంభమైందన్నారు. త్వరలో బీ తాండ్రపాడుతో పాటు మిగతా గ్రామాల్లో సర్వే చేపడతామన్నారు.

జవాబుదారీగా పని చేయండి



సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్

గూడూరు: వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా ఉండి పని చేయాలని తహసీల్దార్ రామాంజనేయులు సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో వీఆర్వోలు, సిబ్బందితో సమావేశయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలిచ్చే అర్జీలకు వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలన్నారు. అనంతరం నగర పంచాయతీ కార్యాలయంలో స్పందన నిర్వహించి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మాధవీలత, నగర పంచాయతీ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, పీఆర్ ఏఈ మోహన్‌రావ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన సమస్యలకు పరిష్కారం చూపాలి

గూడూరు రూరల్: గ్రామ సచివాలయాల్లో చేపట్టిన స్పందనకు ప్రజల నుంచి వచ్చే సమస్యలకు అధికారులు పరిష్కారం చూపాలని ఎంపీడీఓ మాధవీలత సూచించారు. కె.నాగలాపురంలో సోమవారం సచివాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాల్లో సాయంత్రం జరిగే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సాగుకు భరోసా...రైతన్న కులాసా

- మండలంలో 7,165 మంది లబ్ధిదారులు
- ఆర్బీకేల్లో అర్హుల జాబితా
- ఈనెల 18 వరకు దరఖాస్తుల స్వీకరణ
- నాల్గో ఏడాది రైతు భరోసా పంపిణీకి చర్యలు



చిందుకూరు ఆర్బీకేలో వైఎస్సార్ రైతు భరోసా అర్హుల జాబితాను ప్రదర్శిస్తున్న వ్యవసాయ సిబ్బంది

గడివేముల: గతంలో అన్నదాతలు పొలాలను సాగు చేసుకునేందుకు సీజన్ ప్రారంభంలో వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పు తెచ్చుకోవాల్సి దుస్థితి ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రైతన్నలకు అండగా నిలుస్తున్నారు. రైతుభరోసా పథకం ద్వారా ఆర్థికంగా ఆదుకుంటున్నారు. అందులో భాగంగానే నాల్గో విడత డబ్బు రైతుల అకౌంట్లలో జమ చేసేందుకు సిద్ధమయ్యారు.

మండలంలో 7,165 అర్హులు

మండల వ్యాప్తంగా రైతు భరోసా పథకానికి 7,165 మంది రైతులు ఎంపికయ్యారు. అందులో కరిమద్దెల 943, కొరటమద్ది 280, కొర్రపోలూరు 650, గడిగరేవుల 539, గడివేముల 358, గని 722, చిందుకూరు 836, చెనకపల్లె 676, తిరుపాడు 278, దుర్వేశి 252, పెసరవాయి 485, బిలకలగూడూరు 543, బూజునూరు 453, మంచాలకట్ట 158 మంది రైతులు ఉన్నారు. వీరికి రైతు భరోసా నగదు జమ కానుంది.

రైతు భరోసా పొందడం ఇలా..

భూమి ఉన్న ప్రతి రైతు రైతుభరోసా నగదు పథకానికి అర్హులు. అలాగే ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద ప్రయోజనం పొందే వారందరూ ఈ పథకానికి అర్హులే. పట్టారుదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం తీసుకుని స్థానిక ఆర్బీకేలలోని వీఏఏలకు అందజేస్తే వారు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం మూడు విడతలలో రూ.2 వేల చొప్పున జయచేయగా రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో రూ.7,500 జమ చేస్తుంది. దీంతో ప్రతి రైతన్నకు ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం అందుతుంది.

అర్హులందరికీ రైతు భరోసా డబ్బు



వైఎస్సార్ రైతు భరోసాకు సంబంధించిన ఏ ఒక్కరైతుకు అన్యాయం జరగదు. ఇప్పటికే ఆర్బీకేలలో అర్హుల జాబితాను ఉంచాం. జాబితాలో పేరు లేకుంటే ఈ నెల 18వ తేదీలోపు గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ)లను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. పరిశీలించి అర్హత ఉంటే నమోదు చేస్తారు.

– హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల మండలం

గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు



గత ప్రభుత్వాలు రైతుల గురించి పట్టించుకోలేదు. మూడేళ్ల నుంచి ఏటా రైతుభరోసా డబ్బు అకౌంట్లో జమవుతున్నాయి. ఖరీఫ్ ప్రారంభంలో ప్రభుత్వం చేస్తున్న సాయం సేద్యపు ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం మాట తప్పని నేతగా సీఎం జగన్ సాయం చేస్తున్నారు.

– ద్వారం నిరంజన్‌రెడ్డి, రైతు, పెసరవాయి గ్రామం

సీఎంకు రుణపడి ఉంటాం



గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రైతుభరోసా ద్వారా రూ.13,500 ప్రభుత్వ సాయంతో అప్పుల బాధ తప్పింది. ఖరీఫ్ ప్రారంభంలో పెట్టుబడి సాయం వ్యవసాయ ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాలాంటి రైతులకు ఎనలేని సేవలు అందిస్తున్నారు. మా కుటుంబమంతా సీఎంకు రుణపడి ఉంటాం.

– ఉశేన్‌భాష, రైతు, గడిగరేవుల గ్రామం

పెట్టుబడికి ఉపయోగం



నేను సన్నకారు రైతును. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు ఏటా అందజేసే రైతుభరోసా నగదు రూ.13,500 ఎంతో ఉపయోగపడుతోంది. ఒకప్పుడు విత్తనాల కొనుగోలుకు చేతిలో డబ్బు లేక పొలాలు బీళ్లుగా ఉంచుకునేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితిలేదు. భరోసా డబ్బు పెట్టుబడికి ఉపయోగపడుతుంది

– చిన్నశాలుమియ్య, బూజునూరు గ్రామం

ఉపాధి సిబ్బందికి స్థాన చలనం

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఏడుగురు సిబ్బందికి స్థానం చలనం కల్పించినట్లు ఈసీ మధుకృష్ణ సోమవారం తెలిపారు. కార్యాలయంలో సాంకేతిక సహాయకులుగా పనిచేస్తున్న శ్రీకాంత్, కిశోర్, మధుశేఖర్‌లు ఏలూరు జిల్లాకు బదిలీకాగా.. హరీష్, చాంద్ బాషా పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయినట్లు తెలిపారు. అలాగే కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లుగా పని చేస్తున్న రబ్బాని అల్లూరి సీతా రామరాజు జిల్లాకు, రాజు నంద్యాల జిల్లాకు బదిలీ అయినట్లు కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

చుక్కల భూముల పరిష్కారానికి చర్యలు

ఓర్వకల్లు: మండలంలో చుక్కల భూముల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రైతులకుసంబంధించిన అసైన్డు, పోరంబోకు, ప్రభుత్వ భూములు 2007 సంవత్సరానికి ముందు ఆర్ఓఆర్, ఆర్‌హెచ్ఆర్, ఆన్‌లైన్‌లో ఉండి, ఆ తర్వాత చుక్కల భూముల జాబితాలో ఉన్నటువంటి రైతులు దరఖాస్తు చేసుకున్నట్లయితే ప్రభుత్వం వాటికి రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పిస్తోందన్నారు. అలాగే 2017కు ముందు 12 ఏళ్ల పాటు అనుభవంలో ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకుంటే పట్టా భూమిగా మార్చేందుకు అవకాశం కలిస్తున్నట్లు తెలిపారు. అందుకు రైతుల వద్ద ఉన్న అన్ని రకాల డాక్యుమెంట్లు దరఖాస్తుకు జతపరచి, వాటిని స్థానిక వీఆర్ఓతో ధ్రువీకరించి, తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం



ట్రాక్టర్‌ను రైతుకు అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రైతన్నల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే తన నివాసం వద్ద లక్ష్మీపురం గ్రామానికి చెందిన రైతు గ్రూపు సభ్యులకు సీహెచ్‌సీ(కస్టమ్ హయరింగ్ సెంటర్)లను ఏర్పాటు చేసి వైఎస్సార్ యంత్ర సేవ పథకం కింద ట్రాక్టర్‌ను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల కోసం వైఎస్సార్ యంత్ర సేవ పథకం ఏర్పాటు చేసి వారికి అవసరమైన ట్రాక్టర్లను, రోటవేటర్‌లను, ఇతర వ్యవసాయ పనిముట్లను రాయితీ కింద అందిస్తుందని, రైతులు ఈ అవకాశాని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కల్లూరు మండల ఏఓ శ్రీనివాసరెడ్డి, నాయకుడు నాగేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

ఓర్వకల్లు/కల్లూరు: మండల పరిధిలోని బైరాపురం (బొడ్డువానిపల్లె) గ్రామ సమీపంలో బయ్యన్న చెరువులో సోమవారం ఓ వ్యక్తి చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కల్లూరు మండలం ఓబులాపురానికి చెందిన కొందరు వ్యక్తులు చేపలు పట్టేందుకు బయ్యన్న చెరువుకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కాలు జారి చెరువులో పడ్డాడు. గమనించిన తోటి వ్యక్తులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఉలిందకొండ, ఓర్వకల్లు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. నీటి ఉధృతి ఎక్కువ కావడంతో వ్యక్తి ఆచూకీ లభ్యం కాలేదు. చీకటి పడటంతో పోలీసులు గాలింపు చర్యలు నిలిపేశారు. మంగళవారం తిరిగి గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై హత్యాయత్నం

- ఇద్దరిపై కేసు నమోదు

కల్లూరు: ఓ వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు కత్తులతో హత్యాయత్నానికి పాల్పడ్డారు. బంధువుల రాకతో నిందితులు పరార్ కావడంతో బాధితుడు గాయాలతో బయటపడ్డాడు. ఉలిందకొండ ఎస్ఐ నల్లప్ప తెలిపిన వివరాలు.. ఉలిందకొండ గ్రామానికి చెందిన గొల్ల నాగయ్య అదే గ్రామానికి చెందిన ఓ మహిళపై 2022 ఫిబ్రవరిలో లైంగిక దాడికి యత్నించాడు. ఈ కేసులో అతడు జైలుకు వెళ్లి ఇటీవలే బయటకు వచ్చి కోడుమూరు మండలం లింగందిన్నెలో నివాసం ఉంటున్నాడు. మూడు రోజుల క్రితం ఉలిందకొండలో బంధువుల పెళ్లి ఉండడంతో గ్రామానికి వచ్చాడు. ఈక్రమంలో ఆదివారం రాత్రి భోజనం చేసి ఇంటి ముందు కట్టపై కూర్చుంటండగా మహిళ బంధువులు జి.రాముడు, జి.భాస్కర్ గొడ్డలి, కొడవళ్లో దాడి చేశారు. ఈ ఘటనలో నాగయ్య ఎడమ అరచేయి, కాలికి తీవ్ర రక్త గాయాలయ్యాయి. అంతలోనే బంధువులు వచ్చే సరికి నిందితులు పరారయ్యారు. బాధితుడిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నల్లప్ప తెలిపారు.

ఆ భూములతో ఎమ్మెల్యే కాటసానికి సంబంధం లేదు



రిజిస్ట్రేషన్ కాగితాలు చూపుతున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్):కల్లూరు ఎస్టేట్‌లోని ముజఫర్‌నగర్‌లో ఉన్న సర్వే నెంబర్ 524లో ఉన్న భూమిపై పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి ఎలాంటి సంబంధంలేదని సదరుప్లాట్ల యజమానులు చెప్పారు.సోమవారం వారు ప్లాట్ల వద్దకు వచ్చి విలేకరులతో మాట్లాడారు. ఇటీవల తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ మాట్లాడుతూ కల్లూరులోని ఈ భూములను ఎమ్మె ల్యే కబ్జా చేశారని ఆరోపణలు చేశారని, అవి పూర్తిగా అవాస్తవమన్నారు. 11 ఎకరాలకు పైగా ఉన్న ఈ భూమిని 1984లోనే అప్పటి తెలుగుదేశం పార్టీ నాయకులు ధనారెడ్డి వెంచర్ వేసి విక్రయించార న్నారు. వీటిని 600 మంది దాకా బిట్లుగా కొనుగోలు చేశామని తెలిపారు. ఇందులో ఒక్కొక్కరు ఒకటి నుంచి 8సెంట్ల వరకు కొనుగోలు చేశారని చెప్పారు. ఇప్పుడు ఎవరో వచ్చి ఆరోపణలు చేస్తే మరెవరో టీడీపీ పేరు చెప్పి వచ్చి ఆక్రమించుకుంటామంటే చూస్తూ ఊరుకునేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్లప్పస్వామి, మహేష్, చల్లారాముడు, మహ్మద్‌హుసేన్, మాబు, రంగన్న, నాగప్రకాష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు మన ప్రభుత్వం'

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



స్థానిక సమస్యలపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

సి.బెళగల్: సమస్యల పరిష్కారానికే గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. సోమవారం ఆయన ముడుమాల గ్రామంలో గడపగ గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో పొందిన లబ్ధిని లబ్ధిదారులకు వివరిస్తూ సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. నూతనంగా ఏర్పాటైన కాలనీలలో అంతర్గత రోడ్లు, మురుగు కాలువలు, విద్యుత్ స్తంభాలు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందన్నారు. సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి దాదాపు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. కుల, మత, రాయకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంతల మునెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను, వైస్సార్‌సీపీ మండల నాయకులు జగదీశ్వర్ రెడ్డి, మద్దిలేటి, ఎంపీడీఓ రాముడు, తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఎస్ఐ పీరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, హౌసింగ్, పీఆర్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

నేడు కూడా..

ముడుమాల గామంలో మంగళవారం కూడా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగుతుందని ఎంపీడీఓ రాముడు తెలిపారు. గ్రామంలో ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పాల్గొననున్న కార్యక్రమానికి అధికారులు హాజరుకావాలని కోరారు.

కోలుకోలేక యువకుడి మృతి



గిడ్డయ్య మృతదేహం

ఓర్వకల్లు: ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు కోలుకోలేక సోమవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని హుసేనాపురం గ్రామానికి చెందిన బోయ వెంకటరాముడు, అంజనమ్మ దంపతుల కుమారుడు గిడ్డయ్య(26) డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు.కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి అధికం కావడంతో తట్టుకోలేక ఈనెల 13న పురుగు మందు తాగాడు. గమనించిన గుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. మృతుని తల్లి అంజనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరామర్శ

పాణ్యం: వైఎస్సార్‌టీయూసీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా తండ్రి పెద్దహోతూరు వలిసాహెబ్(75) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఫోన్‌లో వలిసాహెబ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు తదితరులు వలిసాహెబ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోండి

పాణ్యం: మండలంలో నిబంధనలకు విరుద్ధంగా నడిచే ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు ప్రతాప్ సోమవారం స్పందనలో అధికారులకు వినతి పత్రం అందించారు.

ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పాణ్యం: స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి 3 నుంచి 9వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జె.క్రిష్టానాయక్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 3వ తరగతిలో 40 సీట్లు, నాలుగులో 27, ఐదులో 29, ఆరులో 16, ఏడులో 5, ఎనిమిదిలో 9, తొమ్మిదో తరగతిలో 9 సీట్లు ఉన్నాయన్నారు. ఈనెల 30న శ్రీశైలంలోని ఐటీడీఏ కార్యాలయంలో లాటరీ పద్ధతిన విద్యార్థుల ఎంపిక ఉంటుందన్నారు. 3వ తరగతిలో రిజర్వేషన్ ప్రకారం అన్ని కులాల వారికి అవకాశం ఉంటుదని, 4 నుంచి 9వ తరగతి వారికి కేవలం ఎస్టీలకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9959758919 సంప్రదించాలన్నారు.

బాలికల కళాశాలలో..

నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అరుణకుమారి తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఏఅండ్‌టీ గ్రూప్‌లకు 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల వారికి 40 చొప్పున సీట్లు, ప్రకాశం, గుంటూరు, అనంతపురం, కడప జిల్లాల వారికి 5 చొప్పున సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9490957266, 9182292406 సంప్రదించాలన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సూర్యనారాయణరెడ్డి

పాణ్యం: మండల పరిధిలోని కొండజూటూరు-పోలూరు గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణానికి సోమవారం జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణ రెడ్డి, గ్రామ సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చొరవతో రూ.4 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రజల రవాణా కష్టాలు తొలగిపోతాయన్నారు. భూమి పూజ కార్యక్రమంలో మండల ఇంజినీరు మహబూబ్‌బాషా, మాజీ సర్పంచ్ ఎల్లప్ప, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈశ్వరయ్యతో పాటు పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

● సుంకులమ్మా.. మన్నించు!



ఇక్కడ కనిపిస్తున్న చిత్రం రెండు తెలుగు రాష్ట్రాల్లో పేరుగాంచిన కె.నాగలాపురం సుంకులాపరమేశ్వరీదేవి రథం. రెండు నెలలుగా రోడ్డుపైనే ఇలా ఉండిపోయవడం భక్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. విషయమేమిటంటే గత మార్చి నెలలో అమ్మవారి బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా జరిగాయి కానీ రథోత్సవంలో చిన్నపాటి సమస్య తలెత్తింది. రథశాల నుంచి రథాన్ని భక్తులు లాగుతుండగా కొంత దూరం వెళ్లిన తర్వాత రాతి చక్రానికి ఉన్న ఇరుసు విరిగిపోయింది. దీంతో అధికారులు, గ్రామ పెద్దలు రథోత్సవాన్ని నిలిపేశారు. ఆలయానికి ఏటా కానుకల రూపంతో దాదాపు రూ.60 లక్షలకు పైగా ఆదాయం వస్తున్నా ఇంత వరకు మరమ్మతులు చేపట్టకుండా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో భక్తులు తీవ్ర వేదనకు గురవుతున్నారు. సుంకులమ్మా మన్నించు అంటూ మదిలోనే వేడుకుంటున్నారు. ఇదే విషయమై ఆలయ ఈఓ దినేష్‌ను వివరణ కోరగా.. ఇరుసు తయారీకి రూ.5 లక్షలకు కాంట్రాక్ట్ ఇచ్చామని, ఆత్మకూరుకు వెళ్లి చెక్క తీసుకురావడానికి కాస్త సమయం పడుతుందని, ఎలాగైనా వారంలోపు మరమ్మతులు ప్రారంభిస్తామని చెప్పారు.

– గూడూరు రూరల్

ఆలయ పరిసరాలు అపరిశుభ్రం



వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం వద్ద కంపుకొడుతున్న మురుగునీరు



వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం ప్రాంగణంలో వర్షం నీటిలో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు

- టెండర్ పూర్తయి రెండేళ్లవుతున్నా డ్రైనేజీ నిర్మించని వైనం
- చోద్యం చూస్తున్న దేవదాయధర్మదాయ శాఖ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని వెంకాయపల్లె ఎల్లమ్మ దేవస్థాన ప్రాంగణం అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. డ్రైనేజీ లేకపోవడంతో పెద్ద గుంత ఏర్పడడంతో మురుగునీటిలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎల్లమ్మ తల్లిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు కంపు భరించలేక ముక్కు మూసుకుంటున్నారు. వర్షం పడినప్పుడల్లా ఒక వైపు మురుగునీటి వాసన.. మరోవైపు వర్షంనీటిలో తడుచుకుంటూఅమ్మవారిని దర్శించుకునే దుర్భర పరిస్థితి నెలకొంది. 2022 మే 21న రూ.7లక్షలకు డ్రైనేజీ నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయి. రెండేళ్లవుతున్నా డ్రైనేజీ నిర్మాణం చేపట్టకపోడడంతో భక్తులు మండిపడుతున్నారు. ఈ నిర్మాణానికి సంబంధించి కర్నూలుకు చెందిన ముక్తా కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్టర్ నవీన్ ఒప్పందం చేసుకున్నా పనులు మాత్రం ప్రారంభించలేదు. ఇంత జరుగుతున్నా దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు చోద్యం చూస్తుండడంపై భక్తులు అసహనం వ్యక్తం చేశారు. డ్రైనేజీనిర్మాణ స్థలంలో కొందరు బంకు అడ్డంగా పెట్టడంతో ఇంత వరకూ నిర్మాణ పనులు ప్రారంభించలేదని దేవస్థానం ఈఓ సీతారామిరెడ్డి వివరణ ఇచ్చారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఆలయ పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.